అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తా

- మూడోసారి ముఖ్యమంత్రి కేసీఆరే
- మహిళల గౌరవం పెంచేందుకే భవనాలు
- ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి
- పలు గ్రామాల్లో పర్యటన

ఉప్పల్‌లో బతుకమ్మ చీరెలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి

కమలాపూర్, అక్టోబర్ 5 : 'ఒక్క అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తా' అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఉప్పల్, ఉప్పలపల్లి, మర్రిపెల్లిగూడెం, నేరెళ్ల గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మహిళా భవనాలు, గ్రామ పంచాయతీ భవనాలను ప్రారంభించారు. అనంతరం కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ మహిళా భవనాలను నిర్మించి మహిళల గౌరవం పెంచిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దే అన్నారు. రాష్ట్రంలో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, మూడోసారి ముఖ్యమంత్రిగా కేసీఆరే ఉంటారని ధీమా వ్యక్తం చేశారు. మండలంలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఎమ్మెల్యేగా గెలిపిస్తేనే అభివృద్ధి జరుగుతుందన్నారు. ఇక్కడ ఉన్న ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌కు ఏడుసార్లు అవకాశం ఇచ్చారని, అయినా నియోజకవర్గంలో ఉప్పల్, శనిగరం, చల్లూరు గ్రామాలను మండలాలు చేయలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఉప్పల్, శనిగరం, చల్లూరు గ్రామాలను మండలాలు చేయడంతోపాటు కమలాపూర్‌ను మున్సిపాలిటీగా మారుస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని ప్రజలకు ఎప్పుడు ఆపద వచ్చినా నేను అందుబాటులో ఉండి ఆదుకుంటానన్నారు. కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఇంటికి తెచ్చి ఇచ్చానన్నారు. తాను రేపు ఏ స్థాయిలో ఉన్నా మీ బిడ్డగానే ఉంటానన్నారు. మహిళా సంఘం భవనాలు నిర్మిస్తేనే ఓటు అడుగుతానని హామీ ఇచి, మాట తప్పకుండా భవనాలు నిర్మించినట్లు తెలిపారు. మాట ఇస్తే మడమ తిప్పకుండా పనిచేస్తామన్నారు. రాబోయే ఎన్నికల్లో ఎవరేమి చెప్పినా నమ్మకుండా అభివృద్ధి చేసిన వాళ్లకు అండగా ఉండాలని కోరారు. కాగా, ఉప్పల్‌లో నూతన మహిళా సంఘం భవనం, మర్రిపెల్లిగూడెంలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ, గ్రామపంచాయతీ కార్యాలయం, జూజునూర్ పల్లెకు బీటీ రోడ్డు, రజక సంఘ భవనం, సీసీ రోడ్లు, డ్రైనేజీలను కౌశిక్‌రెడ్డి ప్రారంభించారు. అలాగే, నేరెళ్లలో గ్రామపంచాయతీ కార్యాలయం, మహిళా భవనం ప్రారంభించగా, ఉప్పలపల్లిలో మహిళా భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఎర్రబెల్లి దేవేందర్‌రావు, ఇనుగాల కిరణ్మయి, బొల్లపెల్లి ఉమ, తిరుపతమ్మ, ఎంపీపీ తడక రాణి, జడ్పీటీసీ కల్యాణి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సంపత్‌రావు, ఎంపీటీసీ తుర్పాటి అరుణ, మండల కోఆప్షన్ సభ్యుడు ఖాజా హసినోద్దీన్, నాయకులు నాయినేని తిరుపతిరావు, సత్యనారాయణరావు, నవీన్‌కుమార్, ఇనుగాల విజయ్, ఎంపీడీవో పల్లవి, ఎంపీవో విమల, ఏపీఎం నారాయణ, పంచాయతీ కార్యదర్శులు, వార్డు సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కడియంను కలిసిన రాజేశ్వర్‌రెడ్డి

ధర్మసాగర్, అక్టోబర్ 5 : స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరిని ధర్మసాగర్ పీఏసీఎస్ చైర్మన్ గుండ్రెడ్డి రాజేశ్వర్‌రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు హనుమకొండలోని ఎమ్మెల్సీ నివాసంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌కు కృతజ్ఞతలు

ఎల్కతుర్తి, అక్టోబర్ 5 : మండలంలోని జీల్గుల గ్రామంలో పునర్నిర్మించనున్న శివాలయానికి ఎండోమెంట్ నుంచి నిధులు ఇప్పించినందుకు హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్‌కు ఆలయ అధ్యక్షుడు పెద్ది శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్తుల చిరకాల వాంఛ అయిన ఆలయ నిర్మాణం కోసం ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ ఎండోమెంట్ అధికారులతో మాట్లాడి రూ.50లక్షలు ఇప్పించినట్లు పేర్కొన్నారు. అందుకు ఆలయ కమిటీతో పాటు గ్రామస్తుల తరుపున ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

'మున్నూరుకాపు భవన శంకుస్థాపనకు తరలిరావాలి'

వరంగల్, అక్టోబర్ 5 : నగరంలోని అలంకార్ జంక్షన్‌లో మున్నూరుకాపు భవన నిర్మాణానికి శుక్రవారం మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేస్తారని, కార్యక్రమానికి మున్నూరుకాపులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య పిలుపునిచ్చారు. గురువారం మున్నూరుకాపు భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి ప్రతి డివిజన్ నుంచి మున్నూరుకాపులు పెద్ద ఎత్తున రావాలని కోరారు. కటకం పెంటయ్య, కనుకుంట్ల రవి కుమార్, శ్రీధర్, తోట తిరుపతయ్య, కామిశెట్టి కోటేశ్వరమ్మ, కందుల సృజన్‌కాంత్, మాడిశెట్టి వరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కొండా దేవయ్య

బీబీఏ రిటైల్ ఆపరేషన్స్ కోర్సుపై అవగాహన సదస్సు

మాట్లాడుతున్న కళాశాల విద్యాశాఖ ఆర్జేడీ రాజేంద్రసింగ్

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 5 : హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాణిజ్య శాస్త్ర విభాగం, కళాశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో బీబీఏ రిటైలింగ్ కోర్సుపై విద్యార్థులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కళాశాల విద్యాశాఖ ఆర్జేడీ డాక్టర్ రాజేంద్రసింగ్ పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం ప్రతి వస్తువు, సేవ వినియోగదారునికి నేరుగా అందించేలా వ్యాపార సంస్థలు తమ కార్యకలాపాలను రూపొందించుకుంటున్నాయని, ఇందులో భాగంగా రిటైల్ ఆపరేషన్స్ సమర్థవంతంగా నిర్వర్తించడానికి నిపుణులను తయారు చేసే ధ్యేయంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కోర్సును రూపొందించిందని తెలిపారు. ఈ కోర్సులో చేరిన విద్యార్థులకు వారానికి మూడు రోజులు తరగతులు, మిగతా మూడు రోజులు రిటైల్ రంగంలో ఉద్యోగం చేస్తూ నేర్చుకునేలా రూపొందించినట్లు తెలిపారు. అలాగే, ఈ కోర్సు పూర్తి చేసిన పూర్తి చేసిన వారికి రిటైల్ రంగంలో సూపర్‌వైజర్ స్థాయి నుంచి సీఈవో వరకు ఎదిగే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో రిటైల్ ఆపరేషన్ల కార్యక్రమాలు అన్ని రంగాలకు విస్తరిస్తున్నాయన్నారు. అంతకుముందు వాణిజ్య శాస్త్ర విభాగం అధ్యాపకులతో ఈ అంశంపై ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. విశిష్టఅతిథిగా విచ్చేసిన కళాశాల విద్యాశాఖ రాష్ట్ర అకడమిక్ సమన్వయకర్త డాక్టర్ డీటీ చారి మాట్లాడుతూ వచ్చే విద్యాసంవత్సరంలో ఈ కళాశాలలో బీబీఏలో రిటైలింగ్‌తో పాటు లాజిస్టిక్స్, హాస్పిటల్ మేనేజ్‌మెంట్, టూరిజం మేనేజ్‌మెంట్ కోర్సులను ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి, వాణిజ్య శాఖ విభాగాధిపతి డాక్టర్ వినోద్ రావు, రిటైలింగ్ కోర్సు కోఆర్డినేటర్ రాజీరు, అధ్యాపకులు లింగారెడ్డి, సుజాత, పావని, సునీత, స్వర్ణలత, నవీన్, బాలచందర్ పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎంపీపీ జక్కుల అనితా రమేశ్

క్రీడాసామగ్రి పంపిణీ చేస్తున్న ఎంపీపీ జక్కుల అనిత, జడ్పీటీసీ వంగ రవి తదితరులు

భీమదేవరపల్లి, అక్టోబర్ 5 : ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ జక్కుల అనితారమేశ్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో కేసీఆర్ క్రీడా సామగ్రి, బతుకమ్మ చీరెల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అహర్నిశలు పేద ప్రజల అభ్యున్నతి కోసమే పాటుపడుతారన్నారు. ఏటా మహిళలకు ఉచితంగా బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. గ్రామీణ క్రీడాకారులు ఆటల్లో ముందుండాలనే సంకల్పంతో ప్రతి గ్రామానికి క్రీడా సామగ్రిని కూడా అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న ప్రభుత్వానికి అందరూ అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వంగ రవి, వైస్ ఎంపీపీ మాడుగుల ఎజ్రా, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు గూడెల్లి రాజిరెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు మండల సురేందర్, ఎంపీడీవో భాస్కర్, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులతో కేఎంసీ పీడీ ప్రభాకర్‌రెడ్డి, గోపి

ఎల్బీ కాలేజీలో కొనసాగుతున్న క్రీడల ఎంపికలు

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 5 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో ఎల్బీ కాలేజీలో జిల్లా స్థాయి ఎస్జీఎఫ్ అండర్-19 బాల బాలికల విభాగంలో క్రీడ సెలక్షన్స్ కొనసాగుతున్నాయి. రెండో రోజు పోటీలకు ముఖ్యఅతిథిగా కేఎంసీ ఫిజికల్ డైరెక్టర్ తుమ్మ ప్రభాకర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. వరంగల్ జిల్లా ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ బరుపాటి గోపి మాట్లాడుతూ రెండో రోజు పోటీలకు వివిధ కళాశాలల నుంచి 486 మంది పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ డాక్టర్ కే సతీశ్, పీడీలు శ్రీనివాస్, కిషన్, రమణ, రవి, పద్మ, విజయ్ కుమార్, ధన్‌రాజ్, రాము, పాపయ్య, సంతోష్‌కుమార్, రాకేశ్, రాహుల్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు దివ్య

దివ్యను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ అరుణ

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 5 : తమిళనాడు రాష్ట్రంలో జరిగే ఖేలో ఇండియా జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎల్బీ కాలేజీ విద్యార్థిని ఎం దివ్య ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అరుణ, పీడీ ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం నుంచి 8 వరకు జరిగి ఈ పోటీల్లో దివ్య రాష్ట్ర జట్టు తరుపున ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు దివ్యను కళాశాల సెక్రటరీ రాజేందర్, చైర్మన్ నిరంజన్‌రెడ్డి, గేమ్స్ కమిటీ సభ్యులు రాజేశ్వర్‌రావు, బీ రజిని, బీ శృతి, జీ సునీత, అధ్యాపకులు అభినందించారు.

కానిస్టేబుల్‌గా ఎంపికైన యువకులతో జడ్పీటీసీ వంగ రవి

కానిస్టేబుల్‌గా ఎంపికైన యువకులకు సన్మానం

భీమదేవరపల్లి, అక్టోబర్ 5 : ఇటీవల కానిస్టేబుల్‌గా ఎంపికైన యువకులను ముల్కనూరు ప్రజాగ్రంథాలయం ఆవరణలో గురువారం జడ్పీటీసీ వంగ రవి ఘనంగా సన్మానించారు. సివిల్‌లో దొండ దివ్య(ముల్కనూరు), మైల శిరీష(హుస్నాబాద్), చిట్కూరి కిరణ్(ముల్కనూరు), అరకాల శివ(ముస్తఫాపూర్), గంజి సాయిరాజు(ముల్కనూరు), ఫైర్ డిపార్ట్‌మెంట్‌లో చిట్కూరి కార్తీక్(ముల్కనూరు), దాసరి అజయ్(ముస్తఫాపూర్), ఏఆర్‌లో కొప్పుల రాజు(కొత్తపల్లి), సంగ కుమారస్వామి(గొల్లపల్లి), టీఎస్ఎస్‌పీలో మ్యాకల రాజు(కొత్తపల్లి), రేవల్లి మోహన్(కొప్పూరు) ఎంపికయ్యారు. ఈ మేరకు వారికి జడ్పీటీసీతోపాటు ప్రజాగ్రంథాలయం నిర్వాహకులు వారిని శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రజాగ్రంథాలయం నిర్వాహకులు గొల్లపల్లి లక్ష్మయ్య, ఎదులాపురం తిరుపతి, తాళ్ల వీరేశం, పల్లా ప్రమోద్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికలో పాల్గొన్న బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, ముఖ్య నాయకులు

ధర్మసాగర్‌లో బూత్ కమిటీల ఎన్నిక

ధర్మసాగర్, అక్టోబర్ 5 : మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గ్రామశాఖ అధ్యక్షుడు బొడ్డు సోమయ్య ఆధ్వర్యంలో గ్రామ స్థాయి కార్యకర్తలు గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ధర్మసాగర్ గ్రామ బూత్ కమిటీలను ఎన్నుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్ర స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లి, మూడోసారి రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చేలా కృషి చేయాలని సూచించారు. అలాగే, స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరికి లక్ష మోజార్టీ లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ శరత్‌చంద్రప్రసాద్, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, ఎంపీటీసీలు, అనుబంధ సంఘాల నాయకులు, కుల సంఘం నాయకులు, కడియం యువసేన సభ్యులు పాల్గొన్నారు.